క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం



ఆలయం వద్ద కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్‌గాం నల్లపోచమ్మ అమ్మవారికి గురువారం ఆలయ కమిటీ సభ్యులు వెండి కిరీటం సమర్పించారు. ముందుగా ఈద్‌గాంలోని శివరామాంజనేయ హనుమాన్ ఆలయం నుంచి గంగనీళ్లు, మంగళహారతులతో కిరీటాన్ని ఎదుర్కొచ్చి అమ్మవారికి బహూకరించారు. 16 నెలలుగా ప్రతి ఆదివారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

పెంబి: మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన భుక్య సుభాష్ జనవరి 12న తాటిగూడ సమీపంలో తన రూ.13వేల విలువైన ఫోన్ పోగొట్టుకున్నాడు. పెంబి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నూతన టెక్నాలజీ ఉపయోగించి ఫోన్‌ను పట్టుకున్నారు. గురువారం సుభాష్‌కు ఫోన్ అందించినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

'కంటివెలుగు' ప్రారంభం

తానూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ తాడేవార్ విఠల్ ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన వారంతా కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నయీంఖాన్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావ్, పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోండి

కడెం: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను అర్హులైన ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 101 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు మీ సేవ కేంద్రాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రం పొంది విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ

ఖానాపూర్: ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండలతో అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, రంగపేట గ్రామాల్లో పనుల ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెట్టెం చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం

భైంసాటౌన్: పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు శ్రీరామోజు గోవింద్, వార్ల గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు హన్మాండ్లు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని..మండల పరిధిలోని విశ్వబ్రాహ్మణులు రావాలని కోరారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

లోకేశ్వరం: పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఫ్‌లకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కూలీలు ఎండ కాక ముందే పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేసిన పనులకు కొలతలు తీసి ఎంబీ రికార్డులు రాయాలన్నారు. ఈసీ అనిల్, టీఏలు ఉన్నారు.

నామినీ పత్రాల స్వీకరణ



నామినీ పత్రాలు స్వీకరిస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో తూము శంకర్ (48) అనే రైతు ఇటీవల మృతి చెందారు. ఆయన భార్య ఆనందబాయి నుంచి గురువారం వ్యవసాయ విస్తరణాధికారి చదల సాయినాథ్ నామినీ పత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా సర్పంచ్ పుష్ప, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, సురేశ్, మార్కెట్ డైరెక్టర్ కె.బాబు తదితరులు ఉన్నారు.

పశువైద్యం అందేదెప్పుడు?

- నిరుపయోగంగా కన్కపూర్ పశువైద్యశాల
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందుల్లో పశుపోషకులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కన్కపూర్‌లో పశువైద్యశాల



పశువైద్యశాలలో మద్యం సీసాలు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో ఏర్పాటు చేసిన పశువైద్యశాల నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోకేశ్వరం మండలంలో 25 జీపీల పరిధిలో 30 గ్రామాలు ఉన్నాయి. వాటిలో లోకేశ్వరం, కన్కపూర్‌లో పశువైద్యశాలలు ఉన్నాయి. లోకేశ్వరంలో పశువైద్య సేవలు అందుతుండగా.. కన్కపూర్‌లో మాత్రం సిబ్బంది లేకపోవడంతో జీవాలకు వైద్యం అందడం లేదు.

15ఏళ్ల కిందట పశువైద్య ఉపకేంద్రం ఏర్పాటు..

కన్కపూర్ పశువైద్యశాల పరిధిలోకి మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, వాస్తాపూర్, ముథోల్ మండలంలోని వడ్తాల్, చింతకుంట గ్రామాలు వస్తాయి. వీటిల్లో 8వేల పశువులు, 25 వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. గతంలో లోకేశ్వరం మండలానికి ఒకే పశు వైద్యశాల ఉండటంతో అంతంతమాత్రంగానే జీవాలకు సేవలు అందేవి. పశు పోషకుల డిమాండ్ మేరకు ప్రజాప్రతినిధుల చొరవతో 15 ఏళ్ల కిందట కన్కపూర్ గ్రామంలో ఉప పశువైద్య కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో జీవాలకు మెరుగైన వైద్యమే అందించారు. కానీ ప్రస్తుతం ఆస్పత్రిని తెరిచేవారు కరువయ్యారు.

మందుబాబులకు అడ్డాగా భవనం..

కన్కపూర్‌లో ఆసుపత్రిలో ఓ పశువైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్, పశువైద్య సహాయకులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా విధులు నిర్వర్తించకపోవడంతో ప్రస్తుతం మూసి ఉంటుంది. ఆసుపత్రి తొలినాళ్లలో వెటర్నరీ అసిస్టెంట్‌తో కాలం వెల్లదీశారు. తర్వాత మూత పడింది. మళ్లీ పోషకులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా 2018లో కాంట్రాక్టు పద్ధతిలో ఒకరిని నియమించారు. కొద్దిరోజులు పని చేశాక వారిని డెప్యూటేషన్‌పై మరో చోటకు పంపించారు. మళ్లీ ప్రజలు ఆందోళన చేయడంతో ఇటీవల 317 జీవో ద్వారా వికారాబాద్ నుంచి హరిప్రియ అనే పశువైద్యురాలు ఇక్కడకు వచ్చారు. కొద్దిరోజులకే పైరవీతో అదే జిల్లాకు డెప్యూటేషన్‌పై వెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో పశువైద్య కేంద్రం మూతబడిపోయింది. భవనం మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. అందులో ఉన్న సామగ్రి శిథిలావస్థకు చేరగా కిటికీలు విరిగిపోయాయి. ప్రస్తుతం లోకేశ్వరం పశువైద్యాధికారి జెస్సీ అప్పుడప్పుడు వచ్చి ఈ కేంద్రం పరిధిలో జీవాలకు వైద్యం అందిస్తోంది.

అధికారులు స్పందించాలి



కన్కపూర్ పశువైద్యశాలను కొన్నేళ్లుగా తీయడం లేదు. దీంత భవనం కుక్కలు, మందుబాబులకు నిలయంగా మారింది. ఈవిషయమై మండల పశువైద్యాధికారికి విన్నవించాం. కన్కపూర్‌లో సిబ్బందిని నియమిస్తే మాలాంటి రైతులకు మేలు జరుగుతుంది.

– మహేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్

ప్రైవేటు వారే దిక్కు..



కన్కపూర్ పశువైద్య కేంద్రం పరిధిలోని గ్రామాలకు నామమాత్రంగానే వైద్యసేవలు అందుతున్నాయి. పశువులకు రోగాలు వస్తే వెంటనే ప్రైవేటు పశువైద్యుల్ని ఆశ్రయిస్తున్నాం. సకాలంలో వైద్యం అందక కొన్ని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. వెంటనే సిబ్బందిని నియమించాలి.

– ముత్యం,కన్కపూర్

త్వరలో పశువైద్యాధికారిని నియమిస్తాం

కన్కపూర్ కేంద్రానికి త్వరలోనే ఓ జూనియర్ పశువైద్యాధికారిని నియమిస్తాం. కన్కపూర్ కేంద్రం పరిధిలోని గ్రామాలకు పశువైద్య సేవలకు లోటు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శంకర్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ, నిర్మల్

దళారులకు విక్రయించి మోసపోవద్దు

- డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి
- గ్రామాల్లో పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పీచరలో కేంద్రం ప్రారంభిస్తున్న రఘునందన్‌రెడ్డి

లక్ష్మణచాంద: రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పీచరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, ఏవో ప్రవీణ్, ఎంపీటీసీ రాజేశ్వర్, గంగారాం, భూమేశ్, లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

సర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్న మహేశ్, సీఈఓ నాగభూషన్, ధనగారి సురేశ్, లింగం పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గొడిసెర, వట్టోలి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంట అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాల్లో వారంరోజుల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, రాజేశ్వర్, భోజన్న, రాజేశ్వర్, శ్రీనివాస్, సాయారెడ్డి, గంగాధర్, సాయినాథ్, భోజారెడ్డి తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్ మండలంలో..

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లె, మున్యాల, బుట్టాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ శారద ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్‌లు నిరోష, శంకర్, ప్రభాకర్, ఆత్మ వైస్ చైర్మన్ రాజు, ఏపీఎం గంగన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్య యాదవ్, గంగన్న, రాయపోసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నరసింహుడి జయంతి



భైంసాలో భక్తుల పూజలు



లోకేశ్వరం: నగర్‌లో రథం ఊరేగింపులో భక్తులు



కడెం: అక్కకొండ లక్ష్మీనరసింహస్వామివారు

భైంసాటౌన్: పట్టణంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా నర్సింహనగర్‌లోని స్వామివారి ఆలయానికి వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామంలో నరసింహస్వామి జయంతి ఉత్సవాలు గురువారం ముగిశాయి. భక్తులు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి రథం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు నరేషచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచమృతాభిషేకం, కల్యాణం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో పల్లకీసేవ, శ్రీలక్ష్మీదేవి సహస్ర కుంకుమార్చన, పండితులు సాయివైభవ్ శర్మ, సాయి భార్గవ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు జరిపించారు.

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామాల సమీపంలో కొండపై కొలువుదీరిన అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం లక్ష్మీనరసింహుడి జయంతి వైభవంగా నిర్వహించారు. అర్చకులు వొద్దిపర్తి వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి తిరుమంజన సేవ, హవనం, తీర్థప్రసాద గోష్టి, హోమం తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజరమేశ్ గౌడ్, మాజీ చైర్మన్ రమేశ్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీ పథకాలు వివరిస్తాం



మాట్లాడుతున్న మోహన్‌రావుపటేల్

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. గురువారం భైంసాలోని దారాబ్జీ ఫ్యాక్టరీలో ఆయన మాట్లాడారు. నిధులు, నీళ్లు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, కేజీ టు పీజీ ఉచితవిద్య, లక్ష ఎకరాలకు సాగునీరు వంటి హామీలు ఏమయ్యాయని నియోజకవర్గ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, ఎంపీ సోయం బాపురావు ఆదేశాల మేరకు బీజేపీ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈనెల 5 నుంచి 'పల్లెపల్లెకు బీజేపీ, గడపగడపకు మో హ న్‌రావ్‌పటేల్' పేరిట ప్రతి ఇంటికి పథకాలు వివరిస్తామన్నారు. కుంటాల మండలం సూర్యపూర్ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమై నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కొనసాగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, కౌన్సిలర్ కపిల్‌సింధే, గాలి రవి, దిలీప్ తదితరులు ఉన్నారు.

కుంటాల: పల్లెపల్లెకు బీజేపీ, గడప గడపకు మోహన్‌రావు కార్యక్రమం విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం ద్వారా ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డు అందుకున్న ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌గౌడ్‌ను రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం సత్కరించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమ్మేళనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అవార్డు అందుకోవడం గొప్ప విషయమని.. రాష్ట్రంలో ఇద్దరికీ మాత్రమే శ్రమశక్తి అవార్డు దక్కిదన్నారు. వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రాజేందర్, ఇద్రిస్ ఘోరీ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ శ్రీనివాస్, నిఖిలరాణి, మాస్ మీడియా అధికారి రవీందర్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కోతకు గురైన రోడ్డు



తానూరు: మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో వాగుకు సమీపంలో ఉన్న రోడ్డు వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

రేణుక ఎల్లమ్మ పట్నాలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ పట్నాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు చిన్ననర్సయ్య ఎల్లమ్మ తల్లికి పంచామృత అభిషేకం, నవగ్రహపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సప్తాహం ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో గురువారం హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తనలు నిర్వహిస్తున్నారు. సమీప గ్రామాల్లోని వార్‌కరి భక్తులు తరలివచ్చారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్టాపన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ హరిజనవాడలో శ్రీ రాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 5న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరుపనున్నారు. ఈసందర్భంగా గణపతిపూజ, విగ్రహ ఊరేగింపు, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తానూరు: మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మార్కెట్ కమిటీ గోదాంలో మొక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించి. రైతువేదికలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో దళితబస్తీ పథకం కింద భూములు పొందిన లబ్ధిదారులకు పెట్టుబడి సాయం చెక్కులు అందిస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : రామబాణం

నారాయణ: విరూపక్ష

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఏపీడీ ప్రసాద్

లక్ష్మణచాంద: జాబ్‌కార్డులు కల్గిన కూలీలందరూ ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ ఓన ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పీచర, ధర్మారం, మల్లాపూర్ గ్రామాల్లో పర్యటించి చేపడుతున్న ఉపాధి పనులను సందర్శించారు. కూలీల మస్టర్లు పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచి.. జాబ్ కార్డులు కలిగిన వారందరికీ పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో ప్రమీల, టీసీ దినేశ్, ఎఫ్ఏలు ప్రేమల పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరసన



కార్యదర్శులకు మద్దతుగా కడెం మండల నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈసందర్భంగా స్థానిక కలెక్టరేట్ ముందు ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద జేపీఎస్‌లు ముగ్గు వేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ముందు రోడ్డును ఊడ్చి నిరసన తెలిపారు. జేపీఎస్‌ల సమ్మెకు పలు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపాయి. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు ఆధ్వర్యంలో జేపీఎస్‌ల శిబిరం సందర్శించి సంఘీభావం తెలిపారు.

భైంసారూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయంలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె గురువారం ఏడో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

కడెం: జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గురువారం కడెం మండల సర్పంచ్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కడెం మండల సర్పంచ్‌ల ఫోరం నుంచి రూ.12వేలు అందించినట్లు సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు గొళ్ల వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, సర్పంచ్ బొడ్డు గంగన్న, లచ్చన్న, మల్లేశ్, రాజన్న, రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

కడెం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణకు హాజరైన విద్యార్థులకు మండల కేంద్రానికే చెందిన ఎల్లంకి భూపాల్ గురువారం స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ మండల ఇన్‌చార్జి వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

వీవోఏల సమ్మె

కుంటాల: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 16వ రోజుకు చేరింది. కార్యక్రమంలో గౌతమ్ హసీనా, గజ్జారాం, ఏసురత్నం, దేవన్న, కమ్రొద్దీన్ తదితరులున్నారు.